ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
5
ఆదివారం 7 ఏప్రిల్ 2024







హంగర్ గేమ్ మాస్టర్ చెఫ్ ఈవెంట్



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : ఆదివారం సా : 6.35 గం..

సహర్ : సోమవారం ఉ :4.42గం..



శనివారం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 41.5°C

కనిష్ఠం : 24.5°C



దేవాలయాలు.. ఆధ్యాత్మిక కేంద్రాలు..

7

- సర్వప్రాణులు దైవస్వరూపమే..
- బుద్ధిని బట్టి మనిషి ఉన్నతమైన ప్రాణిగా రూపొందాడు..
- ఆధ్యాత్మిక కేంద్రాలే.. పరివర్తన క్షేత్రాలు..
- త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి

గామి చిత్ర బృందంతో మాటామంతీ



జోరుగా హుషారుగా..

7

- రెండో రోజు కొనసాగిన స్ప్రింగ్ స్ప్రీ
- నిట్‌లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- ఆకట్టుకున్న పలు కార్యక్రమాలు, గేమ్స్
- అలరించిన సినీ నిర్మాత, డైరెక్టర్ల టాక్ షో..



నిర్మాణ రంగం కుదేలు!

- భారీగా పెరిగిన సామగ్రి ధరలు
- టన్ను ఇసుక రూ.2వేల పైమాటే..
- కృత్రిమ కొరతతో భారీగా పెరుగుతున్న రేటు
- సిమెంట్, స్టీల్, కంకర, ఇటుక, కరెంట్ సామగ్రి ధరలదీ అదే పరిస్థితి
- భారీగా పెరిగిన దినసరి కూలీ, మేస్త్రీల కూలి రేట్లు
- సామాన్యుల సొంతింటి కలలపై ధరల దరువు
- ముందుకు సాగని అభివృద్ధి పనులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

నిర్మాణరంగంపై ధరలు దరువేస్తున్నాయి. ఆకాశాన్నంటిన నిర్మాణ సామగ్రి ధరలతో సామాన్యుడే కాదు బడా బిల్డర్లు కూడా భయపడే పరిస్థితి నెలకొంది. ఇసుక.. స్టీల్, సిమెంట్, ఇటుక, కంకర, కరెంట్ సామగ్రి.. ఇలా అన్నింటి ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఇప్పటికే నిర్మాణ పనులు మొదలు పెట్టినా పెరిగిన ధరలతో ఎక్కడి పనులు అక్కడే నిలిపి వేయాల్సిన దుస్థితి ఏర్పడింది. సామగ్రితో పాటు రోజు వారి కూలీలకు, మేస్త్రీకి ఇచ్చే కూలీ రేట్లు కూడా పెరిగిపోతున్నాయి. దీంతో నిర్మాణం రంగం కుదేలవుతుంది.

భవన నిర్మాణ రంగంపై పెరిగిన సామగ్రి ధరలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. రెండు నెలలుగా ధరలు ఒకదానికంటే మరొకటి పోటీ పడి ధర పెరుగుతుండటంతో సొంతింటి కల కోసం తాపత్రాయ పడే సామాన్యులతో పాటు భారీ భవనాలు నిర్మించే బిల్డర్ల వరకు బెంబేలెత్తిపోతున్నారు. ఇంటి నిర్మాణంలో కీలకమైన ఇటుక ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. లైట్ వెయిట్ మట్టి ఇటుకలకు ట్రాక్టర్ (2వేల) మొన్నటి వరకు రూ.15,000 వరకు తీసుకునేవారు. ప్రస్తుతం నిర్మాణాలు ఊపందుకోవటంతో వ్యాపారులు ధరలను భారీగా పెంచారు. ప్రాంతాన్ని బట్టి 2వేల ఇటుకలు ఉండే ట్రాక్టర్ లోడ్‌కు రూ.19వేల నుంచి రూ.21వేల వరకు విక్రయిస్తున్నారు. ఒక ట్రాక్టర్‌కే నాలుగు వేల నుంచి ఆరు వేల రుపాయలకు అదనపు భారం పడుతోంది. అలాగే స్టీల్ (ఇనుప చువ్వలు) ధరలు రోజుకో రేటుతో సామాన్యుడిని ముప్పుతిప్పలకు గురి చేస్తున్నాయి. ఐఎస్ఐ ముద్ర గల బ్రాండెడ్ స్టీల్ టన్నుకు రూ.4,200 నుంచి రూ.5వేల వరకు విక్రయించారు. అయితే ప్రస్తుతం బంగారం ధరల మాదిరిగానే స్టీల్ ధరలు రోజుకో ధర తెరపైకి తెస్తున్నారు. ప్రస్తుతం బ్రాండెడ్ స్టీల్ టన్ను (బార్) కు రూ.5,000 నుంచి రూ.7,500 వరకు విక్రయిస్తున్నారు. కొంచెం తక్కువ నాణ్యత గల స్టీల్ టన్నుకు రూ.4,500 నుంచి రూ.6,200 వరకు విక్రయిస్తున్నారు. రోజు రోజుకు స్టీల్ ధరలు మారుతుండటంతో ఏ రోజు పెరుగుతుందో.. ఏ రోజు తగ్గుతుందో తెలియక సామాన్యులు స్టీల్ కొనుగోలులో గందరగోళానికి గురవుతున్నారు. దీంతో స్టీల్‌పై టన్నుకు అదనంగా రూ.1,200 నుంచి రూ.2వేల వరకు భారం మోయాల్సి వస్తోందని నిర్మాణదారులు వాపోతున్నారు.



సిమెంట్, ఇసుక బంగారమాయే...

నిర్మాణంలో కీలకమైన ఇసుక, సిమెంట్ ధరలకు రెక్కలొచ్చాయి. రెండు, మూడు నెలల క్రితం టన్ను ఇసుకను వరంగల్ మార్కెట్‌లో రూ.700 నుంచి రూ.850 వరకు విక్రయించారు. అయితే ఇటీవల కాలంలో ప్రభుత్వం కొత్త ఇసుక పాలసీ పేరుతో ఇసుక విక్రయాలపై ఆంక్షలు విధించింది. దీంతో ఇసుకాసురులు సిండికేట్‌గా మారి ఇసుక ధరలను భారీగా పెంచుతున్నారు. కాళేశ్వరం, ఏటూరునాగరం ఏరియాల్లో గోదావరి ఇసుక అన్ని పన్నులు కలుపుకొని టన్నుకు రూ.600కు లభిస్తుంది. అయితే అక్కడి నుంచి వరంగల్‌కు అయ్యే రవాణా ఖర్చులు కలుపుకొని రూ.800 వరకు విక్రయించాల్సి ఉంది. కానీ, ఇసుకాసురులు సిండికేట్‌గా మారి ఇసుకకు కృత్రిమ కొరత సృష్టించి ధరలను భారీగా పెంచి విక్రయిస్తున్నారు. టన్ను గోదావరి ఇసుకకు రూ.1,800 నుంచి రూ.2,200 వరకు వసూలు చేస్తున్నారు. ఒక టన్నుకు రూ.వెయ్యి నుంచి రూ.1,400 వరకు అదనంగా పిండుతున్నారు. ఒక 12టైర్ల లారీలో 28 టన్నుల ఇసుక లోడ్ చేస్తారు. దీనికి టీఎస్ఎండీసీకీ రూ.10,976 వరకు డీడీ రూపంలో చెల్లిస్తారు. ఇదే ఇసుకను వరంగల్‌లో టన్నుకు రూ.2,200 చొప్పున 28టన్నులకు రూ.61,600కు విక్రయిస్తున్నారు. లారీ డీజిల్ ఖర్చు, డ్రైవర్ భత్యం పోగా, ప్రతిలారీ ఇసుక మీద రూ.30 వేలకు పైగా అదనంగా పిండుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక అమ్మకాలపై నియంత్రణ లేకపోవటంతో ఇష్టారాజ్యంగా ధరలు పెంచి విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అలాగే సిమెంట్ ధరలు సైతం బంగారం ధరలతో పోటీపడి పెరుగుతున్నాయి. మొన్నటి వరకు సిమెంట్ బస్తా రూ.320 వరకు విక్రయించారు. రెండు నెలలుగా సిమెంట్ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. బంగారం ధరల మాదిరిగానే సిమెంట్ ధరలు కూడా రోజు రోజుకు మారుతున్నాయి. రూ.360కు బస్తా విక్రయించిన వ్యాపారులు శుక్రవారం ఒకేసారిగా రూ.50 అదనంగా పెంచి బస్తాకు రూ.410 వరకు వసూలు చేస్తున్నారు. దీంతో పాటు కంకర, కరెంట్ సామగ్రి ధరలు విపరీతంగా పెరిగి పోతున్నాయి. రెండు, మూడు నెలల నుంచి ధరలను అదుపు చేయకపోవటంతో వ్యాపారులు ఇష్టారీతిన విక్రయాలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.



అంచనాలను మించుతున్న ఖర్చులు

గృహ నిర్మాణ సామగ్రి ధరలు పెరగటంతో సామాన్యులు విలవిలలాడుతున్నారు. వరంగల్ నగరంలో ఓ చోట 100గజాల స్థలంలో సుమారు రూ.20లక్షల అంచనా వ్యయంతో ఇళ్లు మొదలు పెడితే, పెరిగిన ధరల కారణంగా మరో రూ.5లక్షల నుంచి రూ.8లక్షల వరకు అదనపు భారం పడుతోంది. దీంతో చాలా మంది ఇంటి నిర్మాణ పనులను మొదలు పెట్టినా మధ్యలో

మిగతా 8వ పేజీలో..

కూలీలకు భారీ డిమాండ్

ప్రతీ ఏటా కొత్త నిర్మాణాలు ఎక్కువగా వేసవిలోనే మొదలవుతాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటు బిల్డర్ల అపార్ట్మెంట్‌లు, సొంతింటి నిర్మాణాలు కూడా వేసవిలోనే జోరందుకుంటాయి. కలిసి వచ్చే ముహూర్తాలతో పాటు వేసవిలో వ్యవసాయ పనులు తక్కువగా ఉండటంతో పాటు సెలవులు కూడా ఎక్కువగా ఉంటాయి. దీంతో చాలామంది వేసవిలోనే నిర్మాణ పనులు చేపడతారు. అయితే భవన నిర్మాణాల్లో పని చేసే కూలీల కొరత మరింత ఆందోళనకరంగా మారింది. చాలామంది భవన నిర్మాణాల్లో పనికి ఆసక్తి చూపడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చాలా గ్రామాల్లో వేసవిలో మొదలయ్యే ఉపాధి హామీ పనులకు వెళ్లేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో పట్టణాల్లో కూలీల కొరత తీవ్రమవుతుంది. గతంలో మేస్త్రీకి రోజు కూలీ రూ.800 నుంచి రూ.1,000 వరకు ఇచ్చే వారు. అయితే ప్రస్తుతం మేస్త్రీల రేటు భారీగా పెంచారు. ప్రస్తుతం మేస్త్రీకి రోజు కూలీ రూ.1,200 నుంచి రూ.1,500 చెల్లిస్తున్నారు. అలాగే మహిళా కూలీకి గతంలో రూ.400, పురుషుడికి రూ.600 చెల్లించేవారు. ప్రస్తుతం మహిళకు రూ.500, పురుషుడికి రూ.800 వరకు కూలి చెల్లించాల్సి వస్తోంది.

పాఠశాలల్లో అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

- ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

- భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా

8

సరిహద్దులో అలజడి

7

- కర్రెగుట్ట ఎన్‌కౌంటర్‌తో అలర్ట్
- ఇటీవలే తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ పోలీసుల సమావేశం
- కూంబింగ్‌ను ముమ్మరం చేసిన గ్రేహౌండ్స్ పోలీసులు
- రెండేళ్ల తర్వాత సంఘటన

ఉలిక్కిపడిన దస్తగిరిపల్లి

- అన్నె సంతోష్ ఎన్‌కౌంటర్‌తో కలకలం
- ముగిసిన రెండున్నర దశాబ్దాల ఉద్యమ ప్రస్థానం

8



సంతోష్ (ఫైల్)

అక్క మృతితో ఆగిన తమ్ముడి గుండె

- గంటల వ్యవధిలోనే తోబుట్టువులు ఇద్దరి మృతి
- భూపాలపల్లి జిల్లా చిట్యాలలో విషాదం



కొమురమ్మ(ఫైల్)



చేరాలు(ఫైల్)

చిట్యాల, ఏప్రిల్ 6: భూపాలపల్లి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. అక్క మరణాన్ని తట్టుకోలేక గుండె ఆగి తమ్ముడు తనువుచాలించాడు. కొద్ది గంటల వ్యవధిలోనే తోబు ట్టువులు ఇద్దరూ ప్రాణాలు వదిలారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..

చిట్యాల మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లికి చెందిన ముష్కె కొమురమ్మ (60) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందింది. అక్క మరణ వార్త విన్న ఆమె తమ్ముడు మొగుళ్లపల్లి మండలం వేములపల్లికి చెందిన భాషబోయిన చేరాలు (56) అదే రోజు అర్ధరాత్రి వెంకట్రావు పల్లికి చేరుకున్నాడు. అక్క మృతదేహాన్ని చూడగానే భోరున విలపించా డు. కన్నీరుమున్నీరవుతూ ఒక్కసారి కుప్పకూలిపోయాడు. దీంతో బంధువులు అతడిని స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చేరాలు మృతి చెందాడని నిర్ధారించారు. సీపీఐలో కార్యకర్తగా కొనసాగుతున్న చేరాలు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కొమురమ్మకు భర్త మొండయ్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అక్కా తమ్ముడు ఇద్దరూ ఒకే రోజు మృతి చెందడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరు అవుతోంది. ఈ ఘటనతో ఇద్దరి గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

కాంగ్రెస్ వల్లే రాష్ట్రంలో కరువు

- కేసీఆర్ ముందే చెప్పారు...
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- భూపాలపల్లిలో 'రైతు కోసం బీఆర్ఎస్' దీక్ష



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఏప్రిల్ 6: రాష్ట్రంలో కరువు రావడానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. భూపాలపల్లిలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన రైతు కోసం బీఆర్ఎస్' నిరసన దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరువు వస్తుందని కేసీఆర్ ముందే చెప్పారని గండ్ర గుర్తు చేశారు. అయినప్పటికీ ప్రజలు ఆ పార్టీ నేతల మాయ మాటలు, దొంగ హామీలు నమ్మారని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కరువును దగ్గరకు రానివ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలలకే రైతులు పంట వేసుకునే పరిస్థితి లేక ఆందోళనకు దిగాల్సి వస్తోందని, దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కారణమని ఆరోపిచారు. రాష్ట్రమంతా కరువు విలయతాండవం చేస్తుంటే అవేమీ పట్టించుకోకుండా రాజకీయ పబ్బం గడుపుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా రాజకీయాలు పక్కన పెట్టి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ధాన్యానికి మద్దతు ధర కంటే రూ. 500 అదనంగా చెల్లించాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేలు పరిహారం చెల్లించాలని, తక్షణమే రూ 2 లక్షల రుణమాఫీ చేయాలని అన్నారు.

నాకు వెన్నుపోటు పొడిచి నీ చెంత చేరారు..

అసెంబ్లీ ఎన్నికల్లో తన వెంట ఉన్న వారు వెన్నుపోటు పొడిచారని గండ్ర వెంకటరణమారెడ్డి విమర్శించారు. 'నా వెంట ఉండి వెన్నుపోటు పొడిచిన వారంతా ఇప్పుడు నీ చెంత చేరారు.. నాకు పట్టిన గతే వచ్చే ఎన్నికల్లో నీకూ పడుతుంది' అని ఎమ్మెల్యే

మిగతా 8వ పేజీలో..

ఎల్బీ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్

న్యూశాయంపేట, ఏప్రిల్ 6 : ములుగురోడ్‌లోని లాల్‌బహదూర్ కళాశాల(ఎల్బీ)లో శనివారం ఎంబీఏ విద్యార్థులకు ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవాలయాలు.. ఆధ్యాత్మిక కేంద్రాలు..

త్రిదండి శ్రీమన్నారాయణరామానుజ చిన్నజీయర్‌స్వామి

గూడూరు, ఏప్రిల్ 6 : దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలని.. అవి మనిషిలో మంచి ప్రవర్తన తెచ్చే నిలయాలు కావాలని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి అన్నారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మదనాపురం గ్రామంలో శ్రీలక్ష్మి గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి నూతన దేవాలయ విమాన గోపుర ధ్వజ శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా శనివారం త్రిదండి శ్రీమన్నారాయణరామానుజ చిన్నజీయర్‌స్వామి ఆలయంలో పూజలు, ప్రవచనములు, భక్తుల ఆశీర్వాదం, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ సందర్భంగా చిన్నజీయర్‌స్వామి మాట్లాడుతూ.. దేవాలయాల్లో ప్రజలు, ప్రసాదాలే కాకుండా ఆధ్యాత్మిక కేంద్రాలుగా ఉన్నాయని, అవి అందరికి మంచి చేసేలా ఉపయోగపడాలన్నారు. దేవాలయాలు, వాటిలో విగ్రహాలు మనస్సుకు అద్దంలా నిలుస్తాయన్నారు. మన ఆలోచన విధానంలో మార్పు తీసుకువచ్చేదే మంత్రమన్నారు. మంత్రం అంటే తరించే వారికి రచించేదేనని చెప్పారు. మనుషులు, జంతువులు, పక్షులు, క్రిమికీటకాలు, సూక్ష్మజీవులు చూస్తే అన్ని వేర్వేరే. కానీ, కలిసి సాగితే సుఖ జీవనమన్నారు. మంచి జీవితం కావాలంటే సహజీవనం అవసరం, అదే సమతా భావమని పేర్కొన్నారు. సమాజంలో ఎన్నో వికార పోకడలు, నేనే గొప్ప, నేనే నిలువాలన్న స్వార్థ చింతనలు పెరిగిపోయాయని చెప్పారు. ఈ తీరు మారాలి. మన ఇల్లు, మన ఊరు, సమాజం, దేశం, ప్రపంచమంతా సంతోషంగా ఉండాలన్నారు. ప్రకృతిలో మనిషే కాదు.. చెట్లు, జంతువులు, సూక్ష్మజీవులు ఎన్నో ఉన్నాయి.. అవి లేకుండా మనిషి ఉండలేడు, కానీ మనిషి లేకుండా అవి ఉండగలవన్నారు. కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో మనిషి ఇంటికే పరిమితమైతే ప్రకృతి పరవశించిన విషయాల్ని కళ్లారా చూశామని తెలిపారు. అందుకే మనం పదిలంగా ఉండాలంటే వాటిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అద్దం ఎట్లయితే ముఖాన్ని చూపిస్తుందో.. అలాగే విగ్రహం మనిషి మనస్సులోని దేవుడిని చూపిస్తుందన్నారు. అర్థమండపం ఎట్లా ఉండాలి, ముఖ మండపం ఎట్లా ఉండాలి, దేవాలయంలో గజ, జయ, ధ్వజ స్తంభాల వద్ద నమస్కారం



చిన్నజీయర్‌కు మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

చేసిన తర్వాత గర్భగుడిలో ఉన్న దేవతామూర్తుల వద్ద మొక్కులు చెల్లించుకోవాలని చెప్పారు. ప్రతీ వస్తువులో దేవుడు దాగి ఉన్నాడని, రాతి, లోహం, విగ్రహం, వస్త్రం, మట్టితో చేసిన బొమ్మలో సైతం దేవుడిలా కొలుస్తారని పేర్కొన్నారు. కదిలే ప్రాణులు, మనుషులకు, కదల్లేని ప్రాణులు, చెట్లు వాటికి స్థావరాలుగా ఉంటాయన్నారు. గ్రామంలో సంపదకు లోటు లేకుండా జాగ్రత్త పడాలన్నారు. శిలాలోహం భగవంతుడి స్వరూపాలేనని అన్నారు. దేవాలయంలో విగ్రహాలు, శిల, ఉత్సవ రూపంలో ఉంటాయని స్పష్టం చేశారు.

సుధీర్‌రెడ్డి సేవలు భేష్..

మదనాపురం గ్రామంలో దేవాలయం ఉండాలని ఆకాంక్షించి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, గోశాల, గ్రామ దేవతలకు ఆలయాలు నిర్మించిన లింగాల సుధీర్‌రెడ్డి-రాధిక దంపతులను శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణరామానుజ చిన్నజీయర్‌స్వామి అభినందించారు. గ్రామంలో ఆధ్యాత్మిక సేవలు చేయడం సంతోషకరమన్నారు. ఉన్న ఊరును మరిచిపోకుండా ప్రజల సుఖసంతోషాల్లో భాగస్వాములు కావడం హర్షించదగ్గ విషయమన్నారు. రూ.1.50 కోట్ల సొంత ఖర్చులతో ఆధ్యాత్మిక ఆలయాలను నిర్మించడం అభినందనీయమన్నారు. దేవాలయంలో అన్ని వసతులను కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ఈ వేడుకల్లో లింగాల రోహిత్‌రెడ్డి-అనుపమ దంపతులు, లింగాల నితిన్‌రెడ్డి, సుప్రీంకోర్టు మాజీ జడ్జి ఎల్.నర్సింహారెడ్డి, మానుకోట ఎంపీ మాలోతు కవిత, హరిత, మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్, గూడూరు సొసైటీ చైర్మన్ చల్లా లింగారెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త శ్రీనివాస్‌రెడ్డి, సనాతన శివాలయం చైర్మన్ ఏపూరు రవీందర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, కంభంపాటి ప్రతాప్, మేరెడ్డి సురేందర్, యాదవరెడ్డి, రణధీర్‌రెడ్డి, బోడ కిషన్, మోతీలాల్, చెల్పూరి వెంకన్న, బండి వెంకన్న పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి ఆలయానికి వస్తున్న చిన్న జీయర్‌స్వామి

సరిహద్దులో అలజడి

కర్రెగుట్ట ఎన్‌కౌంటర్‌తో అలర్ట్

కూంబింగ్‌ను ముమ్మరం చేసిన గ్రేహౌండ్స్ పోలీసులు

ములుగు, ఏప్రిల్ 6: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు పూజారి కాంకేర్ పరిధి కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్ జిల్లాలో అలజడి సృష్టించింది. ఈ ఘటనలో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందడం, అందులో భూపాలపల్లి జిల్లా కాటారం మండలానికి చెందిన సంతోష్ అలియాస్ సాగర్ ఉండటం సంచలనం కలిగించింది. దీంతో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. కూంబింగ్‌ను ముమ్మరం చేశారు. ఆదిలాబాద్-మహారాష్ట్ర సరిహద్దులో ఇటీవల భారీ ఎన్‌కౌంటర్ జరిగి 13 మంది మావోయిస్టులు హతమైన నేపథ్యంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో జిల్లా పోలీసులు నిఘా పెంచారు. పౌరుల రాకపోకలపై కన్నేశారు. విస్తృతంగా వాహనాలను తనిఖీ చేయడంతోపాటు ఇన్‌ఫార్మర్ వ్యవస్థను అలర్ట్ చేశారు. తాజాగా ఇరు రాష్ట్రాల సరిహద్దు పోలీసులు వాజేడు మండలంలో సమావేశమయ్యారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతుండగా మావోయిస్టుల నుంచి ఎలాంటి అవాంఛనీయ ఘటన ఎదురవ్వకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిపించే విషయమై చర్చించినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు.

ఈ సమావేశంలో మావోయిస్టులకు చెక్‌పెట్టే పలు అంశాలపై ఇరు రాష్ట్రాల పోలీసులు సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకున్నట్లు తెలిసింది. వ్యూహాత్మకంగా అడుగులు వేసే క్రమంలో కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నట్లు నిఘా వర్గాలు ఇచ్చిన సమాచారంతో గ్రేహౌండ్స్ పోలీసులు శుక్రవారం నుంచి సెర్చ్ ఆపరేషన్ మొదలు పెట్టినట్లు తెలిసింది. ఈ బలగాలకు ములుగు జిల్లా పోలీసులు, సరిహద్దు స్టేషన్‌లలో సుదీర్ఘకాలం పనిచేసి ఈప్రాంతంపై అవగాహన ఉన్న అధికారులను రంగంలోకి దించినట్లు సమాచారం. అనుకున్నట్టుగానే పోలీసులు టార్గెట్‌ను రీచ్ అయ్యారు. దీంతో ఓ రాష్ట్రస్థాయి నాయకుడితోపాటు మొత్తం ముగ్గురు సభ్యులను మావోయిస్టులు కోల్పోయారు. ఈ ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుండటంతో అక్కడి పోలీసులు మృతదేహాలను తరలించారు. ఈ ఎన్‌కౌంటర్‌ను ధ్రువీకరిస్తూ బీజాపూర్ ఎస్పీ జితేందర్ యాదవ్ ప్రకటన జారీ చేయగా కొద్దిగంటల వ్యవధిలోనే మావోయిస్టులు ఈ ఘటనపై స్పందించారు. ఆజాద్ పేరిట ఓ లేఖ విడుదలైంది. పక్కా సమాచారంతోనే పోలీసులు ఎన్‌కౌంటర్‌కు పాల్పడ్డారని, ములుగు ఎస్పీ ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ జరిగిందని పేర్కొన్నారు.

అటవీ ప్రాంతంలో ఉద్రిక్తత

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని పూజార్ కాంకేర్ గ్రామ సమీపంలోని కర్రిగుట్టల అటవీ ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో తెలంగాణ సరిహద్దు, ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పుజార్‌కాంకేర్ గ్రామ సమీపంలోని కర్రిగుట్టల అటవీ ప్రాంతంలో ఛత్తీస్‌గఢ్ పోలీసులతో పాటు గ్రేహౌండ్స్ బలగాలు జాయింట్ యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌లో భాగంగా కూంబింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు తారసపడడంతో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందినట్లు తెలుస్తోంది. మృతుల్లో సీపీఐ మావోయిస్టుపార్టీ సీఆర్‌సీ-2 (సెంట్రల్ రిక్రూట్మెంట్ కమిటీ) కమాండర్ అన్నె సంతోష్ అలియాస్ సాగర్ అలియాస్ శ్రీధర్, మరొకరు మణిరామ్ ఉండగా మిగిలిన మరొకరిని ఇంకా గుర్తించాల్సి ఉంది. మణిరామ్, మరొకరు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పుజార్‌కాంకేర్ గ్రామానికి చెందినట్లు సమాచారం. బీజాపూర్ ఎస్పీ జితేందర్ యాదవ్ ఎన్‌కౌంటర్ విషయాన్ని ధ్రువీకరించగా వూసూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఘటన ప్రాంతంలో ఒక ఏకే-47, ఎల్ఎంజీ, విప్లవ సాహిత్యం లభించగా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

రెండేళ్ల తర్వాత..

చివరిసారిగా 2022జనవరి 18న ఇదే కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో వాజేడు-వెంకటాపురం ఏరియా కమిటీ కార్యదర్శి మడకం సింగి అలియాస్ శాంత, గుండాల-నర్సంపేట ఏరియా కమిటీ కమాండర్ కొమ్ముల నరేష్ అలియాస్ బుచ్చన్న, మరో మావోయిస్టు సభ్యుడు మృతిచెందాడు. పెద్దసంఖ్యలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే పక్కా సమాచారంతో రెండు రోజులుగా ఛత్తీస్‌గఢ్ సీఆర్పీఎఫ్, తెలంగాణ పోలీసులు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. ఆరోజు ఉదయం 7గంటల ప్రాంతంలో మావోయిస్టులు-పోలీసుల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. దాదాపు రెండుగంటల పాటు ఇరువర్గాల నడుమ కాల్పులు జరగగా గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ మధుకు బుల్లెట్ గాయమైంది. కాగా, ఈ ఎదురుకాల్పుల ఘటన నుంచి వాజేడు-వెంకటాపురం ఏరియా కమిటీ కార్యదర్శి సుధాకర్ తప్పించుకున్నాడు. కాగా, మృతిచెందిన వాజేడు-వెంకటాపురం ఏరియా కమిటీ కార్యదర్శి శాంత సుధాకర్ భార్య.

అట్టుడుకుతున్న సరిహద్దు గ్రామాలు

మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఉండే ఛత్తీస్‌గఢ్‌నుంచి తెలంగాణ సరిహద్దు మీదుగా నిత్యం నక్సల్స్ కదలికలు ఉంటాయి. పార్టీ కార్యకలాపాలను రాష్ట్రంలో విస్తరించే క్రమంలో మావోయిస్టులు సరిహద్దు దాటేందుకు ప్రయత్నించిన ప్రతీసారి తెలంగాణ పోలీసులు తిప్పికొడుతున్నారు. పోలీసులు లక్ష్యంగా అమర్చిన మందుపాతరలు, మారణాయుధాలను పెద్దఎత్తున స్వాధీనం చేసుకుంటున్నారు. ఈక్రమంలో ఎదురుకాల్పులు చోటుచేసుకుంటున్నాయి. కొన్ని సందర్భాల్లో మావోయిస్టులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. గడిచిన నాలుగేళ్లలో జరిగిన ఎన్‌కౌంటర్ ఘటనలను పరిశీలిస్తే.. 2020 సెప్టెంబరు 3న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం దేవర్లగూడెం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ మావోయిస్టు, 20వతేదీన చర్ల మండలం పూసుగుప్ప అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు, అదే నెల 23వతేదీన చర్ల మండలం జన్నారం అడవుల్లో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. అక్టోబరు 18న ములుగు జిల్లా మంగపేట మండలం కొప్పుగుట్ట వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో ఒకరు మణుగూరు ఏరియా కమాండర్ సుధీర్. ఇదేనెల 25న వాజేడు మండలం టేకులగూడెంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు, 2021 ఆగస్టు 1వతేదీన చర్ల మండలం బోదనెల్లి అటవీ ప్రాంతంలో ఒక మావోయిస్టు మృతిచెందాడు. డిసెంబరు 28న పెసళ్లపాడులో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతిచెందడం జరిగింది. తాజా ఎన్‌కౌంటర్‌తో సరిహద్దు పల్లెలు అట్టుడుకుతున్నాయి. ఆదివాసీ గూడాలు, గొత్తికోయ గుంపులపై పోలీసులు నిఘా పెంచారు. వాహనాల తనిఖీలను జరుపుతున్నారు. దీంతో చిట్టచివరి పల్లెల జనం భయాందోళనకు గురవుతున్నారు.

జోరుగా హుషారుగా..

రెండో రోజు కొనసాగిన స్ప్రింగ్ స్ప్రీ

నిట్‌లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

ఆకట్టుకున్న పలు కార్యక్రమాలు, గేమ్స్

అలరించిన సినీ నిర్మాత, డైరెక్టర్ల టాక్ షో..



ఖల్‌నాయక్ ఈవెంట్ ప్రదర్శిస్తున్న దృశ్యం

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 6: భావి భారత ఇంజనీర్ల వసంతోత్సవ వేడుకల రెండోరోజు అదే జోష్ కొనసాగింది. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు మసూద సినిమా నిర్మాత రాహుల్ యాదవ్ నక్క, గామి సినిమా డైరెక్టర్ విద్యాధర్ కాగిత అండ్ టీమ్ టాక్ షో అంబేద్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో కిక్కిరిసిన విద్యార్థులను అలరించింది. వరంగల్ నిట్‌లోని వివిధక్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం విద్యార్థులను ఉర్రూతలూగించాయి.

ర్యాప్, నిట్ సోలో ఐడల్ అదరహో...

నిట్ మ్యూజిక్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాప్, నిట్ సోలో ఐడల్ కార్యక్రమం అదరహో అనిపించింది. ఈకార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు ర్యాప్ గీతాలు పాడుతూ శ్రోతలను ఆనందింపజేశారు.

వాట్స్ డిఫరెండ్.. మెదడుకు మేత..

యూత్ రెండ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మరో ఆట వాట్స్ డిఫరెంట్.. ఈ ఆటలో రెండు గదుల్లో నిర్వాహకులు వేర్వేరు ఛాయాచిత్రాలను ఉంచుతారు. రెండు గదుల్లోకి వెళ్లి వచ్చిన పార్టిసిపెంట్స్ వాటిని గుర్తుంచుకొని రాయాలి. లేదంటే ఈ ఆటలో ఓడిపోయినట్లే.

తెలుగు జిలుగుల చదరంగం..

తెలుగు లిటరసీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గేమ్‌లో గోడకు కొన్ని బెలూన్లు అతికించి ఉంచారు. పాల్గొనదలచిన వారు బెలూన్‌లలో ఒక్కదానిని పగలగొడితే అందులో ఓ టాపిక్ ఉంటుంది. ఆ టాపిక్ మీద తెలుగులో మాట్లాడాల్సి ఉంటుంది.

హంగర్ గేమ్స్.. ఫిట్‌నెస్‌పై గురి..

నిట్ ఫుడ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హంగర్ గేమ్స్ ఫిజికల్ ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందిస్తుంది. ఫిట్‌నెస్, ఆరోగ్యం ప్రాముఖ్యతను తెలియజేయడానికి ఈ గేమ్‌ను నిర్వహించారు. పాల్గొనే విద్యార్థులు సిట్‌అప్స్, పుషప్స్ తదితర వ్యాయామ సంబంధ వర్కవుట్స్ చేయాల్సి ఉంటుంది.

మాస్టర్ చెఫ్... అదిరె వంటలు..

నిట్ ఫుడ్ క్లబ్ ఆధ్వర్యంలో వంటల గేమ్ ఏర్పాటు చేశారు. ఈ గేమ్‌లో ఒక బాక్స్‌లో వేసిన చిట్టీల నుంచి పాల్గొనే వారు అందులో నుంచి కొన్ని చిట్టీలను తీసుకొని అందులో రాసిన పదార్థాలతో రాతపూర్వక వంటను తయారు చేయాల్సి ఉంటుంది.

తక్‌దీర్‌కా ఆగే..

ఫన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గేమ్‌లో ఫొటో వెనకాల రాసి ఉన్న విషయాన్ని పాల్గొనే వారు చేయాల్సి ఉంటుంది. ఇందులో పాటలు, సంభాషణలు, నృత్యాలు తదితర అంశాలు ఉంటాయి.

ఖల్‌నాయక్.. ఏ సినిమాలో విలన్..

ఫిల్మ్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గేమ్ విద్యార్థుల్లో జోష్ నింపింది. పాల్గొన్న విద్యార్థులు ఫొటోల ఆధారంగా సంబంధిత ఫొటోలు ఉన్న వివిధ భాషల్లోని విలన్‌లు నటించిన చిత్రాల పేర్లు చెప్పాల్సి ఉంటుంది.

ఇంకా అనేకం..

నిట్‌లోని వివిధ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఇంకా వివిధ రకాలనైన ఫన్ గేమ్స్‌ను నిర్వహించారు. హిప్‌సోల్ క్విజ్, ఫాస్టెస్ట్ వన్ టూ గెస్, ఫిల్మ్ క్విజ్, యానిమీ మ్యూజియం, ఫొటో క్విజ్, మేళా, ఫిల్మ్ ట్రెజర్ హంట్, డంబ్ చార్‌డెస్ తదితర ఆటలు కొనసాగాయి.

స్ప్రింగ్ స్ప్రీలో నేటి కార్యక్రమాలు

తెలుగు సినిమా నటుడు, నిర్మాత నవదీప్ విద్యార్థులతో ముచ్చటిస్తారు. సీతారామం డైరెక్టర్ హను రాఘవపూడి డైరెక్టర్స్ కట్‌లో విద్యార్థులతో ముచ్చటిస్తారు.

సినిమాల్లోకి వచ్చేయండి..

టాక్ షోలో మసూద సినీ నిర్మాత రాహుల్ యాదవ్ నక్క

సినిమా రంగంలోకి రావాలనిపించే యువ ఇంజనీర్లు దూకేయండి.. ఉత్సాహవంతులైన యువతను ప్రతీ రంగం ఆహ్వానిస్తుందన్నారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకుంటే ఉన్నతమైన విషయాలు నేర్చుకోవచ్చునన్నారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన తాను మొదటి గేమ్స్ రంగంలోకి వెళ్లాలనుకున్నానని, తర్వాత రాజకీయం వైపు వెళ్లాలని, ఆ తర్వాత సివిల్స్ కోసం ప్రిపేర్ అయ్యాను. అదీ చేతకాక చివరికి సినిమా రంగాన్ని ఎంచుకున్నాను. ఇంజనీరింగ్ చేస్తున్నప్పుడే నాకంటూ ప్రత్యేకత ఉండాలనే భావన నాలో ఉండేది. అదే భావనతో సినిమా రంగంలోకి వచ్చాను. ప్రతీ వ్యక్తి ప్రయత్నాలు చేయాలని, ఆ ప్రయత్నాల్లో పొరపాట్లు సహజరంగా జరుగుతాయన్నారు. పొరపాట్లు చేయకుండా విజయాలు అందుకోలేమన్నారు. పొరపాట్లను సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. సినిమా రంగాన్ని ఎంచుకున్నాక మా నాన్న తనతో చాలా రోజులు మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. ప్రతీ రంగంలోనూ తప్పొప్పులుంటాయని, అయితే సినిమా రంగంలో ఇవి బయటపడుతాయన్నారు. నా పని నేను చేసుకుపోవాలనే స్వధర్మ ప్రొడక్షన్స్ స్థాపించాను. మంచి ప్రొడక్షన్ టీమ్ ఉంటే మంచి సినిమాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. బ్రహ్మానందం ఫుల్ లెన్త్ క్యారెక్టర్‌తో 'బ్రహ్మానందం' టైటిల్‌తో ఇంజనీరింగ్ బేస్డ్ లవ్ స్టోరీ పూర్తి కామెడీగా తీయబోతున్నట్లు ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌తో సినిమాలు వస్తాయన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు.

సృజన అద్భుత దృశ్యమానం గామి చిత్రం

చిత్ర దర్శకుడు విద్యాధర్ కాగితాల

హనుమకొండ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సృజనాత్మక ఆలోచనలకు అద్భుత దృశ్యరూపమే గామి చిత్రం అని ఆ సినిమా దర్శకుడు విద్యాధర్ కాగితాల అన్నారు. చిత్ర బృందంలోని సభ్యులందరి సమిష్టి కృషి ఫలితంగానే ఈ చిత్రం ఊహించినదానికన్నా బాగా రావడమే కాకుండా అనూహ్య విజయాన్ని సాధించిందని ఆయన అన్నారు. స్ప్రింగ్ స్ప్రీ వేడుకల్లో భాగంగా శనివారం రెండో రోజు వరంగల్ నిట్ క్యాంపస్‌లోని అంబేద్కర్ లర్నింగ్ హాల్‌లో నిర్వహించిన డైరెక్టర్‌కట్స్ ఈవెంట్‌లో దర్శకుడు విద్యాధర్‌తో పాటు గామి చిత్ర బృందం పాల్గొన్నది.

ఈ సందర్భంగా విద్యాధర్ మాట్లాడుతూ.. ఆలోచనలకు అక్షర రూపం ఇస్తే పుస్తకం అవుతుంది. సృజనకు దృశ్య రూపం ఇస్తే అది సినిమా అవుతుందన్నారు. గామి తెలుగు చిత్రపరిశ్రమలో ఒక నూతన వరవడిని సృష్టించిందని అన్నారు. మొదట తాను లఘు చిత్రాల దర్శకుడినని 2014 నుంచి 2017 మధ్య కాలంలో పలు షార్ట్ ఫిల్మ్‌లు తీశానని చెప్పారు. మెకానికల్ ఇంజనీర్ అయిన తాను యాంత్రికంగా ఉండలేక సృజనాత్మకతకు వేదిక అయిన ఫిల్మ్‌మేకింగ్ వైపు అడుగులు వేశానని చెప్పారు. ఇంజనీరింగ్ విద్యార్థుల్లో అనేక మంది ఫిల్మ్‌మేకర్లు ఉన్నారన్నారు. అవునా కాదా? మీలో ఎంత మంది ఫిల్మ్ మేకర్లు ఉన్నారని అడగ్గా పలువురు విద్యార్థులు చేతులెత్తారు. గామి చిత్రం తీయడంలో తమ చిత్ర బృందం ఎదుర్కొన్న సాధక బాధకాలను విద్యార్థులతో ఆయన పంచుకున్నారు. నిట్ ఫిల్మ్ అండ్ మ్యూజిక్ క్లబ్ సభ్యుడు సాయి శ్రీ చరణ్ విద్యార్థుల పక్షాన చిత్ర నిర్మాణానికి సంబంధించి అడిగిన పలుప్రశ్నలకు విద్యాధర్‌తోపాటు చిత్ర బృందంలోని మిగతా సభ్యులు సమాధానాలు ఇచ్చారు. ఈ డైరెక్టర్ కట్స్ పలు రౌండ్లుగా సాగింది. ఫన్ టైమ్ ఎమోజీ రియాక్షన్స్, చిత్రంపై మీమ్స్, ఇష్టమైన సన్నివేశం మొదలైన వాటి గురించి అడిగిన ప్రశ్నలకు దర్శకుడితో పాటు చిత్రబృందం ఇచ్చిన సమాదానలకు విద్యార్థులు కేరింతలు కొట్టారు. నిట్‌లోని ఫిల్మ్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ డైరెక్టర్ కట్స్ ఈవెంట్‌కు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. విద్యార్థులతో హాల్ కిక్కిరిసిపోయింది. అనంతరం విద్యాధర్ అంతకు ముందు నిర్మించిన షార్ట్ ఫిల్మ్‌ను, అలాగే గామీ ట్రైలర్‌ను ప్రదర్శించారు.

ఉలిక్కిపడిన దస్తగిరిపల్లి

అన్నె సంతోష్ ఎన్‌కౌంటర్‌తో కలకలం

ముగిసిన రెండున్నర దశాబ్దాల ప్రస్థానం

కాటారం, ఏప్రిల్ 6: యుక్త వయస్సులో అడవిబాట పట్టిన ఉద్యమ కెరటం నేలవాలింది. రెండున్నర దశాబ్దాల ప్రస్థానం ముగిసింది. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు కరిగుట్ట అటవీ ప్రాంతంలో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని అంకుసాపూర్ జీపీ పరిధిలోని దస్తగిరిపల్లికి చెందిన అన్నె సంతోష్ అలియాస్ శ్రీధరన్న అలియాస్ సాగరన్న మృతి చెందాడు. మావోయిస్టు దండకారణ్యం తెలంగాణ జోనల్ కమిటీ సభ్యుడు, సీఆర్‌సీ-2 కమాండర్‌గా సంతోష్ పనిచేస్తున్నాడు.

అన్నె ఐలోని, సమ్మక్క దంపతుల మూడో కుమారుడైన సంతోష్ పదో తరగతి పూర్తయిన తర్వాత పెళ్లి చేసుకున్నాడు. ఏడాదిపాటు సాగిన కాపురంలో భార్యాభర్తల మధ్య గొడవలు వచ్చాయి. అదే సమయంలో అప్పటి పీపుల్స్‌వార్ (ప్రస్తుత మావోయిస్టు పార్టీ)కి ఆకర్షితుడయ్యాడు. 1999-2000లో సంతోష్ నక్సలైట్లతో కలిసి అజ్ఞాతంలోకి వెళ్లాడు. అప్పటి నుంచి ఒక్కసారి మాత్రమే తల్లిదండ్రులను కలిసినట్లు తెలుస్తోంది. అజ్ఞాతంలోకి వెళ్లినప్పటి నుంచి చురుగ్గా ఉద్యమంలో పాల్గొన్న సంతోష్ వివిధ హోదాల్లో పనిచేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం తెలంగాణ జోనల్ కమిటీ సభ్యుడిగా కొనసాగుతూ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు.

డివిజన్‌లో ముగిసిన అజ్ఞాత పర్వం

కాటారం సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలు నక్సలైట్లకు కంచుకోటగా ఉండేవి. పోలీసులు, నక్సలైట్ల మధ్య ఎన్‌కౌంటర్లు, బ్లాస్టింగ్‌లతో దద్దరిల్లేవి. దశాబ్దాల క్రితం వరకు నక్సల్స్, మిలిటెంట్లు పదుల సంఖ్యలో పనిచేసేవారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరగడం, మారుమూల ప్రాంతాలు అభివృద్ధి బాట పట్టడం, ప్రజల్లో నక్సల్స్ పట్ల సానూభూతి తగ్గడంతోపాటు పలువురు ఇన్‌ఫార్మర్లు పోలీసులకు దళాల గురించి సమాచారం ఇస్తుండటంతో పలువురు ఎన్‌కౌంటర్లలో మృతిచెందారు. ఇంకొందరు లొంగుబాట పట్టారు. దీంతో దశాబ్ద కాల క్రితం డివిజన్ నుంచి వేళ్ల మీద లెక్కగట్టే సంఖ్యలోనే మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు తరలిపోయిన మావోయిస్టులు ఉండేవారు. ఏడెనిమిదేళ్లుగా మల్హర్ మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన లోకె సారమ్మ, మహాముత్తారం మండలం కనుకునూరుకు చెందిన చెన్నూరి స్వరూప అలియాస్ సర్వక్క, కాటారం మండలంలోని అంకుసాపూర్ గ్రామానికి చెందిన అన్నె సంతోష్ అలియాస్ శ్రీధర్ మాత్రమే అజ్ఞాతంలో ఉండగా లోకే సారమ్మను ఎనిమిదేళ్ల క్రితం పోలీసులు అరెస్టు చేశారు. చెన్నూరి స్వరూప ఏడేళ్ల క్రితమే పోలీసుల ఎదుట లొంగిపోయింది. అప్పటి నుంచి కాటారం డివిజన్‌లో మావోయిస్ట్ నేత అన్నె సంతోష్ ఒక్కడే అజ్ఞాతంలో ఉన్నాడు. ఎన్‌కౌంటర్‌లో అతడు మృతి చెందడంతో కాటారం డివిజన్‌లో మావోయిస్టుల పర్వం ముగిసిందని చెప్పొచ్చు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

మంగపేట, ఏప్రిల్ 6: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. పార్టీ మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ. యాకూబ్‌పాషా, బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరావు, బీజేపీ మండల కార్యదర్శి నిడుదవోలు శ్రీనివాసరావు, నాయకులు భూక్య సాయికుమార్, గాజర్ల సంతోష్‌మాదిగ, ఇస్లావత్ శివకుమార్, పోలం రమేష్, గుగ్గిల్ల సందీప్ పాల్గొన్నారు.

• మహదేవపూర్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో పార్టీ జెండాను మండల అధ్యక్షుడు ఆకుల శ్రీధర్ ఆవిష్కరించారు. మండల ప్రధాన కార్యదర్శి మంథని రాజేందర్, యువ మోర్చా అధ్యక్షుడు రాంశెట్టి మనోజ్, బీజేవైఎం జిల్లా వైస్ ప్రెసిడెంట్ జోగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు సొన్నారి శ్యామ్, సంపత్, వినోద్, నిరంజన్ పాల్గొన్నారు.

• మేడారం: తాడ్వాయి మండలం మేడారంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం మండల అధ్యక్షుడు మల్లెల రాంబాబు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో టిఫిన్ బైఠక్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మేడారం బూత్ అధ్యక్షుడు మాదరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. కిసాన్ మోర్చా జిల్లా మాజీ అధ్యక్షుడు జీనుకుల కృష్ణరావు, మండల ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి లక్ష్మణ్, మండల ఉపాధ్యక్షుడు పాపారావు, జిల్లా నాయకులు భర్తపురం నరేష్, ఆలం శ్రీను, అలకుంట చిన్న, వల్లెపు కిరణ్, పోరిక వెంకట్రాం, కీసరి శ్రీను, సిద్దబోయిన సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

• కాటారం: మండల కేంద్రంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను మండల అధ్యక్షుడు బండం మల్లారెడ్డి ఆవిష్కరించారు. ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ మెంబర్ దుర్గం తిరుపతి, బీజేపీ మండల అధ్యక్షుడు గంట అంకయ్య, నాయకులు రాజమౌళి, జిల్లెల్ల శ్రీశైలం, మంత్రి సునీల్, రమేష్, బొంతల రవి, మల్లారెడ్డి, బాపు తదితరులు పాల్గొన్నారు.



మేడారంలో బీజేపీ జెండాను ఆవిష్కరించిన నాయకులు

• ములుగు కలెక్టరేట్ : బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లాకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం జెండాను ఎగురవేశారు. అదేవిధంగా ములుగులోని గ్రామపంచాయతీలో 141పోలింగ్‌స్టేషన్ బూత్ అధ్యక్షుడు మండల ప్రవీణ్ అధ్యక్షతన బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈకార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు గాదం కుమార్, గిరిజనమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, నాయకులు గుగులోత్ స్వరూప, పోసాని సునీల్, అల్లె శోభన్, శీలమంతుల రవింద్రచారి, జినుకల కృష్ణాకర్‌రావు, చల్లూరి మహేందర్, రాయంచు నాగరాజు, లవన్‌కుమార్, రవిరెడ్డి, ఎల్కతుర్తి శ్రీధర్, కిరణ్, శ్రీను, రాజ్‌కుమార్, ఇమ్మడి రాకేష్, గట్ల శ్రీనివాసరెడ్డి, చిన్నకొండారెడ్డి, కవిరాజ్, రాకేష్‌రెడ్డి, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి : ములుగు కలెక్టర్

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 6: మన పిల్లల బంగారు భవిష్యత్తు కోసం చేపడుతున్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జూన్ 10 నాటికి మౌలిక సౌకర్యాలు అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశపుహాల్‌లో శనివారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతను స్థానిక మహిళా సంఘాలకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ప్రతి పాఠశాలలో ఉన్న ప్రతి తరగతికీ ముగ్గురు సభ్యులను ఎంపిక చేసి ఆదర్శ మహిళా కమిటీలో చోటు కల్పించడం జరుగుతుందని అన్నారు. గ్రామ సమాఖ్య అధ్యక్షురాలికి, ప్రధానోపాధ్యాయుడికి జాయింట్ చెక్‌పవర్‌తో ప్రత్యేక బ్యాంకు ఖాతాను వెంటనే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. జిల్లావ్యాప్తంగా 353 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వాటిలో 122పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని, మిగిలిన 231 పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మౌలిక సదుపాయాల కల్పనకు పనులు చేపట్టాలని సూచించారు. ఏప్రిల్ 15వతేదీ నుంచి పనులు ప్రారంభం కావాలని ఆదేశించారు. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే తప్పనిసరిగా బాలికలు, బాలురకు మరుగుదొడ్లు, తాగునీటి సరఫరా, తరగతిగదిలో ఉన్న మైనర్ రిపేర్లను ప్రాధాన్యతక్రమంలో జూన్ 10 నాటికి మౌలిక వసతుల కల్పన పనులు పూర్తయ్యేవిధంగా ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీజ, డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్, డీఈవో పాణిని, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీర్లు, ఈడీఎం దేవేందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎండలతో గొత్తికోయలు జాగ్రత్త

ఏటూరునాగారం రూరల్ : ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని గొత్తికో యలు జాగ్రత్తలు పాటిం చాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండలంలోని గుం డెంగవాయి గొత్తికోయ గూడెంలో ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా, అడిషనల్ కలెక్టర్ పి. శ్రీజతో కలిసి కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా గూడెం వాసులతో సమావేశం నిర్వహించి వారి జీవన విధానం, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వాగులో చెలిమిల ద్వారా నీటిని సేకరించించిన తర్వాత వేడి చేసి అనంతరం తాగాలన్నారు.అనంతరం జిల్లా వైద్యాధికారి అప్పయ్య ఆధ్వర్యంలో గొత్తికోయవాసులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సుభాష్, డీఈ వెంకటసతీష్, ఏఈ మోహన్ వైద్యాధికారి సుమలత పాల్గొన్నారు

భర్త, కొడుకు చేతిలో మహిళ హత్య

భూ విక్రయం విషయంలో గొడవ

చిట్యాల, ఏప్రిల్ 6: భర్త, కొడుకు చేతిలో ఓ మహిళ హత్యకు గురైంది. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం జడల్‌పేటలో ఈ ఘటన శనివారం చోటుచేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...

జడల్‌పేటకు చెందిన చిరంజీవి, విజయలక్ష్మి (43) దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కొన్నేళ్లుగా ఓ భూమి విషయంలో కుటుంబంలో కలహాలు ఉన్నాయి. భార్యాభర్తలు తరచూ గొడవ పడేవారు. భూమిని ఇప్పటికే చిరంజీవి అమ్మగా మళ్లీ అమ్మేయడానికి ప్రయత్నిస్తుండగా విజయలక్ష్మి వారించింది. దీంతో ఇద్దరు మధ్య ఘర్షణలు జరిగేవి. ఈ క్రమంలో విజయలక్ష్మి అడ్డుతొలగించుకొనేందుకు చిరంజీవి పథకం వేశాడు. శనివారం చిన్న కుమారుడు మురళి ట్రాక్టర్‌పై డ్రైవింగ్ పనికి వెళ్లగా చిరంజీవి, పెద్ద కుమారుడు గణేష్ ఇద్దరు కలిసి విజయలక్ష్మిని గొంతు నులిమి ఇంట్లోనే హత్య చేశారు. మృతదేహాన్ని మరోచోటకి తరలించేందుయత్నిస్తున్న క్రమంలో విజయలక్ష్మి చెల్లెలు అనిత అక్కను చూసేందుకు ఇంటికి వచ్చింది. గమనించిన చిరంజీవి, గణేష్ అక్కడి నుంచి తప్పించుకుపోయారు. ఇంట్లోకి వెళ్లిన అనిత విగతజీవిగా మంచంలో పడివున్న విజయలక్ష్మిని చూసి భోరున విలపించింది. దీంతో చుట్టుపక్కల వారు చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి డీఎస్పీ సంపత్‌రావు, సీఐ మల్లేష్ చేరుకుని వివరాలు సేకరించారు. అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ మల్లేష్ తెలిపారు.

ఎనిమిదేళ్ల క్రితం హత్యాయత్నం

చిరంజీవి తన భార్య విజయలక్ష్మిని ఎనిమిదేళ్ల క్రితం కూడా హత్య చేసేందుకు యత్నించాడు. ములుగు జిల్లా తాడ్వాయి అడవులకు తీసుకువెళ్లి గొంతుకోసి అక్కడి నుంచి ఇంటికి చేరుకున్నాడు. అటవీ ప్రాంతంలో కొన ఊపిరితో ఉన్న విజయలక్ష్మి నాలుగు రోజుల తర్వాత పోలీసులకు కనిపించింది. గాయపడిన విజయలక్ష్మిని పోలీసులు ఆస్పత్రిలో చేర్పించి ప్రాణాలను కాపాడారు. కాగా మళ్లీ భర్తే కుమారుడితో కలిసి హత్యకు పాల్పడడం మండల వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ



విజయలక్ష్మి (ఫైల్)

'వామపక్షాల సదస్సును విజయవంతం చేయాలి'

భూపాలపల్లిలో సదరం క్యాంపు

భూపాలపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 6: జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ జనరల్ ఆస్పత్రిలో శనివారం సదరం క్యాంపు నిర్వహించారు. శారీరక, వినికిడి, మానసిక, కంటి చూపుకు సంబంధించిన పరీక్షలు చేశారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి 125 స్లాట్స్ అందుబాటులోకి తేగా 110 మంది మాత్రమే బుక్ చేసుకున్నట్టు డీఆర్డీవో అధికారులు తెలిపారు. వీరితో పాటు మరో ఇద్దరిని కలిపి మొత్తం 112 మందిని పరీక్షించినట్టు పేర్కొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

వెంకటాపూర్(రామప్ప), ఏప్రిల్ 6: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ హాల్‌లో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ఈ సమావేశంలో వివిధ గ్రామాల స్పెషలాఫీసర్లు, మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. సమావేశంలో ఎంపీపీ బుర్ర రజిత సమ్మయ్య, జడ్పీటీసీ గై రుద్రమదేవి సభ దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి తీర్మానాలు చేయలేదు. అనంతరం వివిధశాఖల అధికారులు నివేదికలు సమర్పించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రాజు, డిప్యూటీ తహసీల్దార్ కిషోర్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 6: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పోరిక రవీందర్ అన్నారు. శనివారం ములుగులోని సన్‌రైజర్స్ హైస్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్ జరగగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా డాక్టర్ రవీందర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలకు ప్రాధాన్యత గురించి తెలియజేయడానికి ఫుడ్ ఫెస్టివల్ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల వంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పెట్టెం రాజు, వైస్ ప్రిన్సిపాల్ బల్గూరి జనార్ధన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

కాటారం, ఏప్రిల్ 6: మండల కేంద్రంలో టవేరా, ఎర్టిగా వాహనాల డ్రైవర్స్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక శనివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా గోనె శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా బాసాని హిమాకర్, ప్రధాన కార్యదర్శిగా జాడి శ్రీశైలం, కోశాధికారిగా గౌని అశోక్, ప్రచార కార్యదర్శిగా ఎం.డి. హతీక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అదృశ్యమైన వృద్ధుడి మృతి

కాటారం, ఏప్రిల్ 6: ఐదు రోజుల క్రితం అదృశ్యమైన మండలంలోని బయ్యారం గ్రామానికి చెందిన గద్దె సురేష్(60) మృతదేహం శనివారం లభ్యమైందని ఎస్సై అభినవ్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మతి స్థిమితం సరిగా లేని సురేష్ ఈనెల 1న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. మూడు రోజులు బంధువులు, పరియస్తుల ఇళ్ల వద్ద కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సురేష్ కూతురు ఐత సుజాత ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బయ్యారం గ్రామానికి చెందిన రైతులు పొలాల వద్దకు వెళ్లి దుర్వాసన రావడంతో వెళ్లి చూడగా సురేష్ మృతదేహం కనిపించింది. కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు పొలం వద్దకు వెళ్లారు. మద్యం అలవాటు ఉన్న సురేష్ మతిస్థిమితం సరిగా లేక పొలాల వైపు వెళ్లి అక్కడే పడి మృతి చెందినట్లు భావిస్తున్నట్లు ఎస్సై, మృతుడి కుటుంబసభ్యులు అభిప్రాయపడుతున్నారు. సురేష్ మృతిపై కేసు నమోదు చేసినట్లు కాటారం ఎస్సై అభినవ్ తెలిపారు.

'వామపక్షాల సదస్సును విజయవంతం చేయాలి'

కాకతీయఖని, ఏప్రిల్ 6: ఈనెల 12న వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా సదస్సును కార్మికులు, మేధావులు, వామపక్ష భావాజాల నాయకులు హాజరై విజయ వంతం చేయాలని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు కొరిమి రాజ్‌కుమార్, బందు సాయిలు శనివారం పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కొమురయ్య భవన్‌లో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో నరేంద్రమోడీ అవలంబిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కొమరయ్య భవన్ వద్ద భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, సతీష్, రాజయ్య, సుధాకర్‌రెడ్డి, రాంచందర్, ప్రశాంత్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న లారీ

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఏప్రిల్ 6: జిల్లా కేంద్రంలోని జయశంకర్ విగ్రహం వద్ద కారును లారీ శనివారం ఢీకొంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గణపురం మండలం కోటగుళ్ల ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న నరేష్ పని నిమిత్తం కారులో కాళేశ్వరం వైపుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గం మధ్యలో జయశంకర్ విగ్రహం సమీపంలో లారీ వెనుక నుంచి కారును ఢీకొంది. దీంతో కారు స్వల్పంగా ధ్వంసమైంది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని రెండు వాహనాలను స్టేషన్‌కు తరలించారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రం ఇస్తున్న సీఈ

గణపురం, ఏప్రిల్ 6: రక్తదానం చేయడం మరొకరికి ప్రాణదానం చేసినట్టేనని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు సీఈ సిద్దయ్య అన్నారు. వరంగల్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కేటీపీపీలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్స్ పెద్ద ఎత్తున హాజరై రక్తదానం చేశారు. సుమారు 200 మంది రక్తదానం చేయగా 200 యూనిట్లను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు మురళీమోహన్, కోటేశ్వర్‌రావు, ప్రకాశ్, ముత్యాలరావు, రామకృష్ణ, అన్ని యూనియన్ సంఘాలు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ములుగు ఏజెన్సీ నిప్పుల కుంపటి

మేడారంలో 44.4డిగ్రీల ఎండ

ములుగు, ఏప్రిల్ 6: ములుగు జిల్లాపై సూరీడు కన్నెర్ర జేస్తున్నాడు. నిప్పుల వాన కురిపిస్తున్నాడు. దీంతో చరిత్రలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శనివారం తాడ్వాయి మండలం మేడారంలో 44.4డిగ్రీల వేడి రికార్డయ్యింది. వెంకటాపురం (నూగూరు)లో 44డిగ్రీలు, వెంకటాపూర్(రామప్ప) మండలం లక్ష్మీదేవిపేటలో 43.8డిగ్రీలు, మంగపేటలో 43.2, గోవిందరావుపేటలో 42.8, కన్నాయిగూడెంలో 42.7, ములుగు మండలం ఖాసిందేవిపేటలో 42.7, వాజేడులో 41.8, ఏటూరునాగారంలో 40.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాతావరణ శాఖ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. గడిచిన వారంరోజులుగా 40డిగ్రీలు దాటి ఎండ తీవ్రత ఉంటోంది. ఈ పరిస్థితి రాబోయే రోజుల్లో కొనసాగే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ములుగు, ఏప్రిల్ 6: ములుగు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని శ్రీనివాసకాలనీ, ప్రగతినగర్, వీవర్స్‌కాలనీ, కలెక్టరేట్ రోడ్డు, బండారుపల్లి రోడ్డు, కృష్ణకాలనీ, హనుమాన్ బస్తీ, తదితర ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ సాయికృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు జరుగనుండగా ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

ఎన్‌కౌంటర్ నేపథ్యంలో హై అలర్ట్

వాజేడు, ఏప్రిల్ 6: తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతం కర్రిగుట్టల వద్ద శనివారం జరిగిన ఎన్‌కౌంటర్ నేపథ్యంలో పోలీసులు హై అలర్ట్ అయ్యారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం ములుగు జిల్లా సరిహద్దులో ఉండటంతో అప్రమత్తమయ్యారు. మావోయిస్టులకు, పోలీసు బలగాలకు జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. ఈ నేపథ్యంలో ఎదురుకాల్పుల్లో తప్పించుకున్న మావోయిస్టుల కోసం పోలీసులు వేట కొనసాగిస్తున్నారు. గాయాలపాలైన మావోయిస్టులు సరిహద్దు అటవీ ప్రాంతం నుంచి సమీప గ్రామాల్లోకి ప్రవేశించే అవకాశం ఉండటంతో వారిపై నిఘా పెంచారు. వెంకటాపురం సర్కిల్ పరిధిలోని వాజేడు, పేరూరు స్టేషన్ల ఎస్సైలు శనివారం ఉదయం నుంచి ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. పేరూరు ఎస్సై గొర్ల రమేష్ మండలంలోని అయ్యవారిపేట వద్ద, వాజేడు ఎస్సై వెంకటేశ్వరరావు చీకుపల్లి జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి రాకపోకలు సాగించే వ్యక్తులపై దృష్టి సారించి తనిఖీలు చేశారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించి వదిలేశారు. ఇటీవల వరుస ఎన్‌కౌంటర్‌లు జరుగుతున్న నేపథ్యంలో ఏజెన్సీలో ఎప్పుడేం జరుగుతుందోనన్న ఆందోళనలో ప్రజలు ఉన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వరుస కూంబింగ్ ఆపరేషన్లు చేపడుతూ మావోయిస్టులకు చెక్‌పెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం.

జన జాతరకు కాంగ్రెస్ శ్రేణులు



భూపాలపల్లి నుంచి తుక్కుగూడకు తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 6: రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో జరిగిన కాంగ్రెస్ బహిరంగ సభకు (జన జాతర) జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి భారీగా ఆ పార్టీ శ్రేణులు తరలివెళ్లాయి. పట్టణం నుంచి సుమారు 20 కార్లలో నాయకులు, కార్యకర్తలు బయల్దేరారు. పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, నాయకులు చల్లూరి సమ్మయ్య, మంజాల రవీందర్, క్యాతరాజు సాంబమూర్తి, చెరుకుతోట శ్రీరాములు, పైడిపల్లి రమేష్, లక్ష్మారెడ్డి, ఐఎన్‌టీయూసీ నాయకులు సమ్మిరెడ్డి, రాజిరెడ్డి, మధూకర్, నర్సింగారావు, రాజేందర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

• ములుగు: జనజాతర బహిరంగ సభకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో నాయకులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ములుగులోని జాతీయ రహదారిపై నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

• కాటారం: కాంగ్రెస్ ఆధ్వర్యంలో తుక్కుగూడలో నిర్వహించిన జనజాతర సభకు ఆ మండలం నుంచి ఆ పార్టీ నాయకులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు చీమల సందీప్, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, పట్టణ అధ్యక్షుడు పసుల మొగిలి, నాయిని శ్రీనివాస్, ప్రభాకర్, శ్రీహరి, కుమార్, మధుకర్, రమేష్, మల్లయ్య, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

• టేకుమట్ల: కాంగ్రెస్ జనజాతరకు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వైనాల రవీందర్, మండల ప్రధాన కార్యదర్శి దాసారపు సదానందం, మండల ఉపాధ్యక్షుడు మోతే రాజమౌళి, మాదం కొమరయ్య, బండ శ్రీకాంత్, చిరంజీవి, నామని రాజేందర్, కత్తి సంపత్, సరోత్తం, కత్తి సంపత్, ఐలయ్య, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

• మహదేవపూర్: కాంగ్రెస్ బహిరంగ సభకు మండలంలోని కాళేశ్వరం నుంచి కాంగ్రెస్ శ్రేణులు శనివారం బయల్దేరాయి. బ్లాక్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మెంగాని అశోక్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ తప్పనిసరి

భూపాలపల్లి, ములుగు జిల్లాల జడ్జిలు నారాయణబాబు, సూర్యచంద్రకళ

కృష్ణకాలనీ (భూపాలపల్లి)/ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 6: నిత్య జీవితంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ తప్పనిసరి అని భూపాలపల్లి జిల్లా జడ్జి పి.నారాయణబాబు, ములుగు జిల్లా జడ్జి ఎస్.వి.పి.సూర్యచంద్రకళ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రెండు కోర్టుల ఆవరణలో శనివారం వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జిలు మాట్లాడుతూ మన ఆరోగ్యం, మన చేతుల్లోనే ఉంటుందని, దాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి, ములుగు సీనియర్ సివిల్ జడ్జిలు జయరాంరెడ్డి, టి.మాధవి, రెండు జిల్లాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిలు రామచంద్రారావు, రామ్మోహన్‌రెడ్డి, భూపాలపల్లి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అఖిల, బార్ అసోసియేషన్ల అధ్యక్షులు కూనూరు సురేష్‌కుమార్, ఎం.వినయ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్లు రాజయ్య, నవ్యరాణి తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న భూపాలపల్లి జిల్లా జడ్జి పి. నారాయణబాబు

వడదెబ్బతో జాగ్రత్త!

భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 6: వడదెబ్బ బారినపడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. సమీకృత కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన శనివారం సమావేశమయ్యారు. వేసవిలో తీసుకోవాల్సి జాగ్రత్తలపై సమీక్షించారు. రానున్న రెండు నెలలు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు జాగ్రతలు పాటించాలన్నారు. వారికి అధికారులు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవసర మందులతోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను వైద్య ఆరోగ్య శాఖ అందుబాటులో ఉంచాలన్నారు. వ్యవసాయ రైతులు, కూలీలు ఉదయం 11 గంటలకు ముందు గానీ, సాయంత్రం 5 గంటల తర్వాత గానీ పనులకు వెళ్లేలా వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు మాత్రమే అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో మధుసూదన్, డీపీవో నారాయణరావు, డీఏవో విజయ్ భాస్కర్ పాల్గొన్నారు.

నిర్మాణ రంగం కుదేలు!

5వ పేజీ తరువాయి

నిలిపేస్తున్నారు. అప్పోసప్పో చేసి ఇల్లు కడుతామంటే మోయలేని భారంతో పాటు వడ్డీలతో నడ్డి విరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. సామాన్యులే కాకుండా బిల్డర్లదీ ఇదే పరిస్థితి. ముందే పాత ధరలకు అనుగుణంగా ప్లాట్లకు ముందే అడ్వాన్స్ తీసుకున్నారు. కానీ ప్రస్తుతం ఊహించినదానికంటే ఎక్కువగా ధరలు పెరగటంతో మధ్యలోనే అపార్ట్‌మెంట్ నిర్మాణ పనులు నిలిపివేస్తున్నారు. ప్లంబింగ్, విద్యుత్ సామగ్రి ధరలు 30శాతానికి పైగా పెరిగాయని, లేబర్ చార్జీలు 25శాతం వరకు పెరిగాయని కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీగా పెరిగిన ఇసుక, స్టీల్, సిమెంట్, కంకర ధరలతో అంచనాలు మించిపోతుండటంతో నిర్మాణరంగం కుదలేవుతోంది. సామాన్యుల సొంతింటి కల కలగానే మిగిలి పోయే పరిస్థితి ఏర్పడుతోంది.

కాంగ్రెస్ వల్లే రాష్ట్రంలో కరువు

5వ పేజీ తరువాయి

గండ్ర సత్యనారాయణరావును ఉద్దేశించి అన్నారు. ప్రజా సంక్షేమాన్ని పక్కకు పెట్టి పార్టీ ఫిరాయింపులపై ఎమ్మెల్యే దృష్టి పెట్టడం మానుకోవాలని హితవు పలికారు. రౌడీ రాజకీయాలు, దేవుడి గుడిపై రాజకీయాలు, అక్రమ కేసులు మాని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, మునిసిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణి, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కళ్లెపు రఘుపతిరావు, బుర్ర రమేష్, సెగ్గం సిద్ధు, మందల విద్యాసాగర్‌రెడ్డి, లక్ష్మీనరసింహారావు, మహిళా విభాగం అర్బన్ అధ్యక్షురాలు తిరుపతమ్మ, కౌన్సిలర్లు ముంజం పల్లి మురళీధర్, ఎడ్ల మౌనిక, ఆకుదారి మమత తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఒకరి మృతి

మహదేవపూర్, ఏప్రిల్ 6: ఆటో బోల్తాపడి ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడిన సంఘటన మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద శనివారం చోటుచేసుకుంది. కాటారం నుంచి మహదేవపూర్ వస్తున్న ఆటో టైరు మార్గమధ్యలో పేలిపోయింది. దీంతో ఆటో బోల్తా పడటంతో డ్రైవర్‌తోపాటు ఇద్దరు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న పుల్యాల మల్లేష్ (21)ను ఆస్పత్రికి తరలిస్తుండగానే అతడు మృతి చెందాడు. గాయాలపాలైన డ్రైవర్‌తోపాటు మరొకనే మహదేవపూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

కాటారం : మండలంలోని మేడిపల్లి అటవీప్రాంతంలోని 353(సీ)జాతీయ రహదా రిపై, కాటారం-మంథని రహదారిపై ధన్వాడ స్టేజీ సమీపంలో శనివారం రాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు, ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ప్రతాపగిరి గ్రామానికి చెందిన జూకంటి కార్తీక్ కారులో వేగంగా వెళ్తా మేడిపల్లి అటవీ ప్రాంతంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయాడు. దీంతో కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టుకు ఢీకొని ధ్వంసమైంది. దీంతో కార్తీక్ తీవ్రంగా గాయపడగా అతడిని ఆస్పత్రికి తరలించారు.

మరో సంఘటనలో గట్లకుంటకు చెందిన రాజు, సరిత దంపతులు గంగారం వెళ్లి ఇంటికి తిరిగివస్తుండగా ధన్వాడ స్టేజీ సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడింది. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సంఘటన స్థలాలను ఎస్సై అభినవ్ పరిశీలించారు.